క్లుప్తంగా

ఎంపీ విజయసాయి రెడ్డిని కలసిన అమృతపాణి



ఎంపీ విజయసాయి రెడ్డితో అమృతపాణి

చీరాల రూరల్: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీసీ రీజినల్ కో ఆర్డినేటర్ విజయసాయి రెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చీరాలకు చెందిన డాక్టర్ వరికూటి అమృతపాణి ఒంగోలు సమీపంలోని ఢిల్లీ హైవే హోటల్లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ పరిస్థితుల గురించి వారు చర్చించారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారని తెలిపారు.

విజిలెన్స్ అదుపులో గ్రానైట్ లారీలు

బల్లికురవ: పర్మిట్ లేకుండా అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్న మూడు గ్రానైట్ ముడిరాయి లారీ, ఒక స్లాబు లారీని మంగళవారం అర్ధరాత్రి మైన్స్ అండ్ విజిలెన్స్ ఏడీ వీరేశ్ అదుపులోకి తీసుకున్నారు. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ నుంచి మల్లాయపాలెం మీదుగా ఫ్యాక్టరీలకు వెళ్తున్న మూడు ముడి రాళ్ల లారీలను బల్లికురవ వైపునకు వస్తున్న స్లాబ్ లారీని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ చెల్లించకుండా అక్రమంగా తరలించే స్లాబులకు పెనాల్టీతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా రామచంద్రారెడ్డి



చీరాల: మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.రామచంద్రారెడ్డికి స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు బుధవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారిగా ఉన్నందున పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా చీరాల మున్సిపాలిటీలోనే స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా ఆయన కొనసాగనున్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని విభాగాల అధికారులు, సిబ్బందికి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

దేవదాయశాఖ పరీక్షకు ఉచిత శిక్షణ

బల్లికురవ: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అర్చకుల రాత పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మండలంలోని కొణిదెన కంఠ శైవాగమ పాఠశాల నిర్వాహకుడు గూడూరి మోహన శర్మ బుధవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ దేవాలయాల్లో ఖాళీగా ఉన్న అర్చకుల పోస్టులను భర్తీ చేసేందుకు ఇటీవల దేవాదాయ శాఖ కమిషనర్ ఎం సత్యనారాయణ ఫిబ్రవరి 2024లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించినట్లు తెలిపారు. అర్చకత్వం, ప్రతిష్టలు, కల్యాణోత్సవం, నిత్య అర్చనలపై బ్రాహ్మణులకు మాత్రమే రెండు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నాలుగు ఆగమాలకు సంబంధించి సిలబస్‌ను సిద్ధం చేశామని, మరిన్ని వివరాలకు 99483 16141 నంబరును సంప్రదించాలని కోరారు.

రేపు డయల్ యువర్ డీఎం

చీరాల అర్బన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, సలహాలు, సూచనలు అందించేందుకు ఈనెల 10న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జంజనం శ్యామల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రయాణికుల సమస్యలు, మెరుగైన సేవలకు 99592 25696 నెంబర్‌కు సంప్రదించాలన్నారు. అలానే కార్తీక మాసం సందర్భంగా పంచారామాలకు, శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



అద్దంకి పొలాల్లో నిలిచిన నీరు



తిమ్మాయపాలెం పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

దంచి కొట్టిన వాన.. నవ్విన రైతు



సోమవరప్పాడులో కళకళలాడుతున్న జొన్న



జీవం పోసుకున్న మిర్చి

- మెట్ట పంటలకు జీవం పోసిన వర్షం
- శనగ సాగు రైతుల్లో ఆనందం

అద్దంకి: వర్షం రాకతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మెట్ట దుక్కులు పదును కావడంతో పాటు స్లాల్లో నీళ్ల నిలిచాయి. ఇప్పటికే సాగు చేసిన మెట్ట పంటలకు ఈ వాన జీవం పోసినట్లయింది. దాంతో మెట్ట పంటలు కళకళలాడుతున్నాయి. మరికొద్ది రోజుల్లో అదును మించిపోతుందని, మబ్బుల వైపు చూసి నిట్టూర్చిన పప్పు శనగ రైతులు వర్షాన్ని చూసి విత్తేందుకు సిద్ధం అయ్యాడు. అద్దంకి మండలంలో 850 ఎకరాల్లో మిర్చి పంట, 250 ఎకరాల్లో పత్తి పంట, ఎకరాల్లో 3వేల ఎకరాల్లో పప్పు శనగ వేయడానికి రైతులు సిద్ధం అయ్యారు. బల్లికురవ మండలంలో 2000 ఎకరాల్లో మిర్చి పంట, 1200 ఎకరాల్లో పత్తి, కంది,జూట్ 600 ఎకరాల్లో సాగు చేశారు. 500 ఎకరాల్లో పప్పు శనగ సాగు చేయడానికి సిద్ధమయ్యారు. సంతమాగులూరు మండలంలో 4800 ఎకరాల్లో మిరప, 1500 ఎకరాల్లో కంది. 420 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశారు. పశుగ్రాసం 300 ఎకరాల్లో సాగు చేశారు. ఈఏడాది 2000 ఎకరాల్లో పప్పు శనగ సాగు చేయడానికి సిద్ధమయ్యారు. అదే విధంగా జే పంగులూరు మండలంలో 2500 ఎకరాల్లో మిర్చి పంట, 3000 ఎకరాల్లో పొగతోటలు, 3000 వేల ఎకరాల్లో శనగ సాగు చేయడానికి సద్ధం కాగా, కొరిశపాడు మండలంలో 200 ఎకరాల్లో కంది, 400 ఎకరాల్లో మిర్చి, 250 ఎకరాల్లో 50 ఎకరాల్లో మినుము, 650 ఎకరాల్లో పొగతోటలను సాగు చేశారు. ఆ పంటలు కళకళలాడుతున్నాయి. దీంతో రైతుల్లో ఆనందం నెలకొంది. అద్దంకి ప్రాంతంలో ఈనెలలో పడాల్సిన సరాసరి వర్షపాతం 119.1 మిమీ. 7వ తేదీ కురిసిన వర్షపాతం 105.5 మిమీ, 5వ తేదీ 18.2 మిమీ, 6వ తేదీ 45.6 మిల్లీ మీటర్లు.

నేటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం

మార్టూరు: నేటి నుంచి ఈనెల 23వ తేదీ వరకు మండలంలోని ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు సీఎంగా కావాలంటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీ నితిన్ ఒక ప్రకటనలో తెలిపారు. 9,10 తేదీల్లో మార్టూరు-1,2 సచివాలయాలు, 14,15 తేదీల్లో మార్టూరు-3,4 సచివాలయాలు, 16న నాగరాజుపల్లి, 17న రాజుగారిపాలెం, 20న రాజుపాలెం, 21, 22 తేదీల్లో వలపర్ల-1,2 సచివాలయాలు, 23వ తేదీ బొబ్బేపల్లి గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయా సచివాలయాల సిబ్బంది గ్రామ వలంటీర్‌లు, స్థానికులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవో తెలిపారు.

జే.పంగులూరు: నేటి మండల పరిధిలోని 10 సచివాలయాలో ఈ నెల 23 వరకు ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరగనున్నట్లు ఎంపీడీవో రామాంజినేయులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా షెడ్యూల్ మేరకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి ప్రజలకు సచివాలయాల ద్వారా అందిన ప్రయోజనాలు తెలియజేయాన్నారు..

నేడు కారంచేడులో 'మానమ్మకం నువ్వే జగనన్న'..

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు-1 గ్రామ సచివాలయ పరిధిలో గురువారం 'మానమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు గ్రామంలో నిర్వహించే కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు హాజరవుతారని, సంబంధిత అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి భూమి పూజ



పూజలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

పర్చూరు (చినగంజాం): మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమాన్ని బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పర్చూరు నుంచి బాపట్ల వెళ్లే మార్గంలో చెరువు కట్టపై సుమారు 5 సెంట్ల విస్తీర్ణంలో బుధవారం ఉదయం ఆలయ కమిటీ చైర్మన్ పాలేరు ఎడ్వర్డ్ యాదవ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పర్చూరు నియోజకవర్గ యాదవజేఏసీ కన్వీనర్ నాగరాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మహిళలు భారీగా పాల్గొన్నారు.

ప్రశాంతంగా విద్యా సంస్థల బంద్

అద్దంకి: కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ కార్యక్రమం అద్దంకిలో విజయవంతం అయింది. దీంతో పట్టణంలోని ప్రైవేటు కళాశాలలను స్వచ్ఛందంగా మూసేసినట్లు ఎస్ఎఫ్ఐ అద్దంకి డివిజన్ నాయకుడు అశోక్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో ఏ ప్రేమ్, కౌటిల్య విద్యార్థులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

బల్లికురవ: గ్రంథాలయ వారోత్సవాలను నవంబర్ 14 నుంచి ఈనెల 20వ వరకు నిర్వహించనున్నట్లు బల్లికురవ శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ ఏ రమేశ్‌బాబు బుధవారం తెలిపారు. 14న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, ప్రాముఖ్యత, డ్రగ్స్‌పై అవగాహన, 16న గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు, 17న కవి సమ్మేళనం, రచయిత సందేశాలు, 18న గ్రంథాలయాల ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు, 19న మహిళా దినోత్సవం, దిశా చట్టం, సాధికారతపై చర్చ, 20న డిజిటల్ లైబ్రరీ వినియోగం చదవడం మాకు ఇష్టంతోపాటు బహుమతి ప్రదానం చేయున్నట్లు చెప్పారు. ఈవారోత్సవాల్లో విద్యార్థులు, ప్రముఖులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మొక్కల్లో ఔషధ గుణాలు



ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కృష్ణకుమార్

దగ్గుబాడు (కారంచేడు): అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయగలిగే అనేకమైన ఔషధ గుణాలుండే మొక్కలు మన మధ్యలోనే దర్శనమిస్తుంటాయని ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ అన్నారు. ఈ నెల 10వ తేదీన ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని దగ్గుబాడు మొయిన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. మొక్కలను చూపించి వాటిని గుర్తు పట్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పరిసరాల చుట్టూ పెరిగే మొక్కల్లో జామ, మందారం, వేప, రావి, తిప్పతీగ వంటి అనేకమైన మొక్కల ద్వార ఔషధాలు తయారవుతుంటాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భవనం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి హనుమంతరావు

చినగంజాం: జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, సీహెచ్ హనుమంతరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కే స్వరూపరాణి అధ్యక్షతన గృహ నిర్మాణ శాఖ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రాజశేఖర్, ఈఓపీఆర్డీ ఎస్ వేణుగోపాలకృష్ణమూర్తి, ఉపాధి హామీ ఏపీఓ జే లక్ష్మీదేవి, వైఎస్సార్ కేపీ ఏపీఎం కే అంజిబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

తీరప్రాంతాల్లో శుభ్రత అవసరం



ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుతున్న సొసైటీ సభ్యులు

వేటపాలెం: సముద్రతీర ప్రాంతాల్లోని బీచ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎం వీఎస్ శర్మ సూచించారు. బుధవారం మండలంలోని రామాపురం సముద్ర తీరం వద్ద ఫినిష్ సొసైటీ ఎన్‌జీఓ, ఐటీసీ బంగారు భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా తీరప్రాంతాల్లో స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. తీరం వెంటగల ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి ఐ కాశీ విశ్వనాథ్, పంచాయతీ సెక్రటరీ పి పూర్ణిమ, ఫినిష్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



చీరాలలో సమావేశం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు



వలంటీర్లతో మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూపరాణి



మార్టూరులో మా నమ్మకం నీవే జగనన్న జెండాలు ప్రదర్శిస్తున్న నాయకులు

చీరాల: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని చీరాల నియోజకవర్గంలో అఖండ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ నాయకులు సూచించారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు ఈనెల 9 నుంచి మండలంలోని ప్రతి సచివాలయంలో నిర్వహించే 'ఆంధ్రప్రదేశ్‌కి జగనన్న ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పట్టణ, మండల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి చేయాల్సిన కార్యక్రమాలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా పార్టీ విజయానికి చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, చీరాల మండల పార్టీ అధ్యక్షుడు ఆసాది అంకాలరెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ బోయిన కేశవులు, జేసీఎస్ కన్వీనర్ బుర్ల సాంబశివరావు, పార్టీ నాయకులు బిట్రా శ్రీనివాసరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, పృథ్వీ ధనుంజయ్, గుంటూరు సుబ్బారావు, గవిని నారాయణ, నల్లబోతుల రాజ్‌కుమార్, బుర్ల మురళి, పిట్టు పోలయ్య, గుర్రం బుజ్జిబాబు, షేక్ మస్తాన్, బక్కా అద్దంకిరెడ్డి, మచ్చా సువార్త, పి.శ్రీనివాసరావు, షేక్ అజాద్, కావూరి బాలకోటిరెడ్డి, డీ మార్క్ తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: మండలంలో నేటి నుంచి మా నమ్మకం నీవే జగనన్న కార్యక్రమం పది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మా నమ్మకం నీవే జగనన్న జెండాలు, టోపీలను నాయకులు కార్యకర్తలకు పంపిణీ చేశారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంపై కార్యాచరణ..

చినగంజాం: 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం వలంటీర్‌లు, పంచాయతీ సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం అయ్యేలా చూడాలని ఎంపీడీవో కే స్వరూపరాణి సూచించారు. బుధవారం ఆమె చినగంజాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యక్రమ నిర్వాహణకు సంబంధించి కార్యచరణను తెలియజేసేందుకు అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించారు. 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమంలో వలంటీర్‌లు, సిబ్బంది తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్ వేణుగోపాల కృష్ణమూర్తి, కార్యదర్శి మస్తాన్, వలంటీర్‌లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పదింతల మేలు



చిమ్మిరిబందలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



పుల్లాయిపాలెంలో జీగురు అట్టలు ఏర్పాటు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

మార్టూరు: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని మార్టూరు సబ్ డివిజనల్ యాంకర్ బ్యూలా అన్నారు. మండలంలోని చిమ్మిరిబండ రైతు భరోసా కేంద్ర పరిధిలో బుధవారం మహిళా రైతులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె ఘనజీవామృతం తయారీ, భూమిలో కలపడం వలన కలిగే ప్రయోజనాలను రసాయనిక ఎరువుల వినియోగం వలన ఎదురవుతున్న సమస్యల గురించి స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వీ కనకదుర్గ, నాగేశ్వరమ్మ, లక్ష్మి తిరుపతమ్మ, ఈ వెంకటేశ్వరమ్మ, రైతు కంది మళ్ల హరిబాబు, నాగమణి, అనూష, విజయలక్ష్మి, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లాయిపాలెంలో..

చీరాల టౌన్: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయం చేయడం వలన రైతులకు ఆర్థికంగాఖర్చులు తగ్గుతాయని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గవినివారిపాలెం పంచాయతీలోని పుల్లాయిపాలెంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేస్తున్న మిరప తోటలను వ్యవసాయ అధికారులు, ప్రకృతి వ్యవసాయం సిబ్బందితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు కవిత, శిరీష, పద్మజ, రైతులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి రక్తపరీక్షలు తప్పనిసరి



రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

స్వర్ణ (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థికి రక్త పరీక్షలు నిర్వహించాల్సి ఉందని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షాలినీ అన్నారు. బుధవారం ఆమె మండలంలోని స్వర్ణ, స్వర్ణపాలెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య సిబ్బందిచే రక్తపరీక్షలు చేయించారు. ప్రతి విద్యార్థికి రక్త పరీక్షలు చేయడం వలన వారిలోని హిమోగ్లోబిన్, బ్లడ్‌గ్రూప్, ఇతర సాధారణ వ్యాధులు, వైరల్ ఫీవర్స్, సాధారణ జ్వరాల పరిస్థితులను అంచనా వేయవచ్చన్నారు. వీటి ఆధారంగా పిల్లల్లో భవిష్యత్‌కు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్సీసీ బెటాలియన్ 23 చీరాల డివిజన్ విద్యార్థులకు కూడా రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎల్‌టీ బయ్యా శంకర్, పీఈటీ కట్టా ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హక్కుల సంరక్షణ అందరి బాధ్యత



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అతిథులు

మేదరమెట్ల: బాలల హక్కులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీడీపీవో కృష్ణకుమారి అన్నారు. మండల కేంద్రం కొరిశపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం బాలలహక్కుల వారోత్సవాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఆడపిల్లలు సెల్‌ఫోన్‌లలో వచ్చే కార్యక్రమాలను చూస్తూ కొంతమేర చెడుదారుల్లోకి వెళ్తున్నారని, తల్లిదండ్రులు పిల్లల పట్ల అశ్రద్ధ చేయరాదన్నారు. కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాలను అంతం చేద్దాం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిసోర్స్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏరియా కోఆర్డినేటర్ పులిపాటి వీరయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

బల్లికురవ: ఇష్టపడి చదివితే మంచి విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం అనీల్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు 85 మంది తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఐదు నెలల కళాశాల పనిదినాలకు సంబంధించి విద్యార్థులు హాజరు, క్వార్టర్లీ, మూడు యూనిట్ పరీక్షల్లో వచ్చిన మార్కులు ప్రోగ్రెస్ రిపోర్టులను వారికి అందజేశారు. 2001లో ఏర్పాటైన ఈ కళాశాల దినదినాభివృద్ధితోపాటు ఫలితాల్లో నంబర్ వన్‌గా నిలుస్తోందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి టీ రవీంద్రబాబు, అధ్యాపకులు పాల్గొని మాట్లాడారు.

ఒన్‌టౌన్ సీఐని కలిసిన కౌన్సిలర్లు



సీఐకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

చీరాల: చీరాల ఒన్‌టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన వి.శేషగిరిరావును బుధవారం రాత్రి మున్సిపల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గుంటూరు ప్రభాకరరావు, కె.యానాదిరావు, పార్టీ నాయకులు కోడూరి ప్రసాద్‌రెడ్డి, షేక్ సుభాని, అప్పల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.